# పెరటి చెట్టు

సాయంత్రం ఐదు కావస్తోంది. ఆ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో ఉన్న నా క్లినిక్‌ని సరిగ్గా ఐదింటికి తెరవటం అలవాటు. మెట్లెక్కుతూ మొదటి అంతస్తులోని ఓ గది ముందు గుమికూడి ఉన్న జనం వైపు చూశాను. యిది రోజూ కన్పించే దృశ్యమే. ఆ గది ముఖద్వారంపైన పెద్దపెద్ద అక్షరాలతో రాసిన బోర్డుంది "వాస్తు, జ్యోతిష శాస్త్ర పండితులు శ్రీ శివానంద మూర్తి" అని. లోపల కూచోడానికి చోటులేక బైట నిలబడి తమ వంతు కోసం పడిగాపులు పడ్తున్నారు జనాలు. తమకున్న కష్టాలు, బాధలు, రుగ్మతలు వాస్తు జ్యోతిష శాస్త్ర పరిజ్ఞానంతో తీరతాయన్న ప్రగాఢ విశ్వాసంతో వచ్చిన అమాయక ప్రజలు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ఠమైన ప్రగతిని సాధిస్తూ, యిరవై ఒకటో శతాబ్దంలోకి అడుగు పెట్టినా ఈ ప్రజల మూఢ నమ్మకాలు మారవు... వాటిని ఆసరాగా చేసుకుని సాగుతున్న దోపిడీ మారదు అనుకోగానే జాలితోనో, బాధతోనో నవ్వొచ్చింది.

క్లినిక్ తలుపు తెరిచి లోపలికెళ్ళాను. పేషంట్స్ కూచునే చిన్న గది... అందులో ఆరు ప్లాస్టిక్ కుర్చీలు... ఓ చిన్న టీపాయ్‌మీద రకరకాల వార మాస పత్రికలు, రెండు మూడు దినపత్రికలు... చెక్క పార్టిషన్తో దానికానుకుని చిన్న గది... అందులో తెల్లటి గుళికల్తో నిండిన మందులసీసాలు పేర్చబడి ఉన్నాయి. అక్కడో చెక్క కుర్చీ... వాటిని దాటుకుంటూ నా గదిలో కెళ్ళి కూచున్నాను.

నేను రాసిచ్చే మందులివ్వడంకోసం ఓ అబ్బాయి ఉన్నాడు. డిగ్రీ ప్రైవేట్‌గా చేస్తున్నాడు. పార్ట్‌టైం ఉద్యోగం... నెలకు నాలుగు వేలు జీతమిస్తాను. ఐనా ఏరోజూ సమయపాలన చేసిన పాపాన పోలేదు. నేనొచ్చిన అరగంటకొస్తాడు. అప్పటికి నేనే లైట్లూ ఫ్యాన్లు వేయటం, నా టేబుల్ శుభ్రం చేయటంలాంటి పనులు చేసేసుకుంటాను.

క్లినిక్ తెరిచిఉంచే సమయం సాయంత్రం ఐదు నుంచి తొమ్మిది వరకు. నేను కచ్చితంగా ఐదు కావడానికి కొద్దిగా ముందే వచ్చేస్తాను. ఆలస్యంగా వస్తున్నందుకు ఆ అబ్బాయిని ఒకట్రెండుసార్లు మందలించాను. బస్ దొరకలేదనో, అనారోగ్యమనో ఏదో కారణం చెప్పడంతోపాటు మనసులో వంకరగా నవ్వుకుంటున్నట్లు అన్పించేది. 'సరిగ్గా ఐదింటికొచ్చినా యిక్కడ చేసేదేముంది సార్... ఈగలు తోలుకోవటం తప్ప. పేషెంట్లే లేనపుడు నేను చేసే పనేం ఉంటుంది?' అని ప్రశ్నిస్తున్నట్లు ...

ఐదున్నర దాటింది. బైట కుర్చీ లాగిన శబ్దాన్ని బట్టి మందులిచ్చే కుర్రాడు వచ్చాడని అర్థమైంది. టేబుల్ మీదున్న మెడికల్ జర్నల్ చదువుతూ కూచున్నా. ఆరయింది. జర్నల్ పక్కన పడేశాను. మెటీరియా మెడికా తీసి కొద్దిసేపు తిరగేసాను. ఆరున్నరయింది. ఒక పేషంట్ లోపలికొచ్చింది. గొంతు నొప్పి... జ్వరమూనట. మందు రాసిన స్లిప్‌ని ఆమెకిచ్చి బైట మందు తీసుకోమని చెప్పాను. ఎనిమిది లోపల మరో యిద్దరు పేషంట్లని చూశాను. ఎనిమిదిన్నరయింది. యింకెవరూ వచ్చేలా లేరు. యింతే... రోజుకి యిద్దరూ ముగ్గురు తప్ప రారు. ఒక్కో రోజు పూర్తిగా ఖాళీగా కూచుని యింటికెళ్తాను.

'హోమియోపతిలో డాక్టర్ కోర్సు చేయగానే సరిపోదు. పేషంట్లని మన దగ్గరకు రప్పించుకునే నేర్పుకూడా ఉండాలి' అందోసారి నా భార్య వీణ.

'వైద్యం అనేది వ్యాపారం కాదు. అనారోగ్యంతో బాధపడేవారికి మనంచేసే సేవ'

'అయ్యో నాఖర్మ. ఏ కాలంలో బతుకుతున్నామో తెలిసే మాట్లాడుతున్నారా... మీతో పాటు ప్రాక్టీస్ పెట్టిన రవన్నయ్యని చూడండి. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. దేనికైనా తెలివుండాలి'

'తెలివికీ డబ్బు సంపాదనకు సంబంధం లేదు. మెడిసన్లో నేను గోల్డ్‌మెడలిస్ట్‌ని. రవి రెండు సార్లు పరీక్ష తప్పాడు తెలుసా' అన్నాను ఉక్రోషంగా.

'ఎన్నిసార్లు ఆ పరీక్ష తప్పితే ఏమైంది... జీవితానికవసరమైన ప్రాక్టికల్ పరీక్షలో నంబర్‌వన్‌గా నిలిచాడుగా. మీరు గోల్డ్‌మెడల్ తప్ప ఏం సాధించారు? యిప్పటికీ అద్దె యింట్లో కాపురం... అమ్మాయిని యింజనీరింగ్ చదివించే స్థోమత లేక బి.యస్సీలో చేర్పించాను. ఎప్పుడూ డబ్బుకి కటకటే... పేరుకి మాత్రం హోమియేపతి డాక్టర్' అంది.

వీణ దెప్పిపొడిచినట్లు మాట్లాడినా ఆమె ఆక్రోశాన్ని ఆవేదనని సవ్యంగానే అర్థం

చేసుకున్నాను. ఎటొచ్చీ రవిలా నేను చదివిన చదువుని అవమానించి డబ్బు సంపాదించటం మాత్రం నా చాతకాదు.

రవీ నేనూ ఒకే కాలేజీలో హోమియోపతి మెడిసన్ చదివాం. రవికి యం.బి.బి.యస్.లో సీటు రాక బి.హెచ్.యం.యస్.లో చేరితే నేను యంసెట్లో మంచి ర్యాంక్ వచ్చినా యిష్టపడి హోమియోపతిలో చేరాను. నాకు వూహ తెల్సినప్పటినుండీ నాన్న హోమియోపతి మందుల్నే వాడేవాడు. మాకే అనారోగ్యం కలిగినా తెల్లగా గుండ్రంగా సగ్గుబియ్యం గింజల్లా ఉన్న మాత్రల్ని మా నోట్లో వేసేవాడు. అవి చప్పరిస్తుంటే తీయగా ఉండటం వల్ల పిల్లలందరూ ఆ మందు వేసుకోడానికే ఆసక్తి చూపేవారు.

నాన్న ఎలిమెంటరీ స్కూల్లో టీచరు పని చేసేవాడు. తీరిక సమయాల్లో హోమియోపతి మందుల గురించి రాసున్న పుస్తకాన్ని ముందరేసుకుని కూచునేటోడు. వూళ్లో కొంతమంది నాన్నగారిమీద నమ్మకంకొద్దీ ఆయన దగ్గరకొచ్చి మందు వేయించుకునేవారు. వాళ్ళు సంతోషంగా డబ్బులివ్వబోయినా పైసా తీసుకునేవాడు కాదు. 'నాలుగైదు చక్కెర గుళికల్లో కొద్దిపాటి మందు... ఏం పెద్ద ఖర్చని... ఈ మందులు చవకే. నమ్మకం లేక చాలామంది వాడరు గానీ భేషుగ్గా పని చేస్తాయి. నీ జబ్బు తగ్గింది కదా. నాకదే తృప్తి. డబ్బెందుకూ... నాకు గడవకనా... ఏదో నాకు తెల్సినంతలో పదిమందికీ ఉపయోగపడితే భగవంతుడు మెచ్చుతాడు. చాలదూ' అనేవాడు.

నాకు చిన్నప్పటినుండీ హోమియోపతి మందులంటే నమ్మకం ఏర్పడింది. యిప్పటివరకూ నేను యింగ్లీష్ మందు వాడి ఎరుగను. రోగిమీద ఏ రకమైన దుష్ప్రభావం చూపించకుండా రోగనిదానం చేసే హోమియో మందులకు, రోగాన్ని నయం చేస్తూనే మరో రుగ్మతకు కారణమయ్యే సైడ్ఎఫెక్ట్‌లు కలుగచేసే యింగ్లీష్ మందులకు అసలు పొంతనే లేదు.

కాని రవి హోమియో మందులతోపాటు యింగ్లీష్ మందులు వాడటం ప్రారంభించాడు. యింజక్షన్లివ్వటం, టాబ్లెట్లు, టానిక్కులు రాసివ్వటం చేస్తున్నాడని తెలిసిన కొత్తలో ఓ రోజు అతని క్లినిక్‌కెళ్ళాను.

నేను వేళ్ళేప్పటికి రవి తన ఎదురుగా కూచున్న పేషంట్‌తో మాట్లాడుతున్నాడు. బైట వెయిటింగ్ రూంలో ఓ పది మంది దాకా కూచుని ఉన్నారు. నన్ను చూడగానే 'రా ఉమేష్, కూచో... జస్ట్ మినిట్' అంటూ మళ్ళా పేషంట్‌తో 'నీకీ సమస్య ఎప్పటినుంచి

ఉంది' అని అడిగాడు. అతను సమాధానం చెప్పాక 'గోలీలు రాసిస్తున్నాను. ఐదు రోజులు వాడు. అన్నం తిన్నాక ఉదయం ఒకటి రాత్రికొకటి వేసుకోవాలి. ఈ టానిక్ బలానికి రాసిచ్చాను పూటకో చెంచా తాగు' అన్నాడు. పేషంట్ దగ్గర నూటయాభై రూపాయలు తీసుకుని అతన్ని పంపించే ముందు 'మందులు ఈ వీధి చివర ఉన్న మెడికల్ షాపులోనే కొను. నా రైటింగ్ వేరే వాళ్ళకు అర్థం కాక ఓ మందు బదులు మరో మందిస్తే ప్రమాదం' అన్నాడు. నా వైపుతిరిగి నవ్వుతూ 'ఏంటీ యిలా వచ్చావు? ఈ రోజు క్లినిక్‌కి శెలవా?' అన్నాడు.

'లేదు. కానీ నీతో అత్యవసరంగా మాట్లాడాలనిపించి వచ్చాను. అతనికి ఏం హోమియోమందు రాశావు?' అని అడిగాను.

'హోమియోమందా పాడా... యూరిన్ యిన్‌ఫెక్షన్ ఉందట. నార్‌ఫ్లాక్స్ యాంటీబయాటిక్స్ రాసిచ్చాను.'

'అదేమిటి? యూరిన్ యిన్‌ఫెక్షన్ని తగ్గించే మంచి మందులు హోమియోలో ఉన్నాయి కదా'

'ఉమేష్. నేను ప్రాక్టీస్ పెట్టాక ఒక విషయం గమనించాను. పేషంట్‌కి సంబంధించినంత వరకు అది యింగ్లీష్ మందా, హోమియోనా, ఆయుర్వేదమా అనేది ముఖ్యం కాదు. వాళ్ళక్కావల్సింది జబ్బు నయం కావటం. ఏదైతే రోగాన్ని త్వరగా నయం చేస్తుందో అదే మందు. నేను హోమియో మందిచ్చినా తగ్గలేదనుకో. మళ్ళా నా దగ్గరకు రాడు. అందుకే యాంటిబయాటిక్స్ యిచ్చా. తగ్గకపోవటమనే సమస్యే లేదు. దాని వల్ల రోగికి నామీద నమ్మకం కుదుర్తుంది. డబ్బుకి డబ్బు.. పేరుకి పేరు' అన్నాడు.

'మనం చదివింది హోమియో వైద్యం. యింగ్లీష్ వైద్యం గురించి, ఆ మందుల గురించి తెలీకుండా వాటిని వాడమని రోగికి చెప్పటం తప్పు కాదా. నీ మనస్సాక్షినడిగి చూడు'

రవి పెద్దగా నవ్వాడు. పడీ పడీ నవ్వాడు. పెద్ద జోక్ విన్నట్టు నవ్వాడు.

'మనస్సాక్షా మశానమా... డాక్టర్‌కోర్సు చదివింది గోళ్ళు గిల్లుకుంటూ కూచోడానికి కాదు. డబ్బులు సంపాదించాలంటే యిలాంటివి చేయక తప్పదు.. నాలా చాలామంది చేస్తున్నారు... కావాలంటే పదిమందిని అడిగి తెల్సుకో. నువ్వొక్కడివే మడి గట్టుకుని కూచున్నంత మాత్రాన లోకమేమీ మారిపోదు.'

'యింజక్షన్లు కూడా యిస్తున్నావట'

మళ్ళా పెద్దగా నవ్వాడు రవి. 'మూర్ఖపు మనుషలు ఉమేష్... నాలుగు చక్కెర గోళీలిచ్చి నూరు రూపాయలడిగితే యివ్వడానికేడుస్తారు. అదే ఓ యింజెక్షన్ చేసి రెండొందలడిగితే సంతోషంగా సమర్పించుకుని దండాలు పెట్టి వెళ్తారు.'

అతని వాదనతో విసిగిపోయి 'నువ్వు చదివిన చదువుని..నీకు చదువు చెప్పిన గురువుల్ని..నిన్ను నమ్మి నీ దగ్గరకొచ్చే రోగుల్ని, చివరికి నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావు రవీ' అన్నాను.

'దీనివల్ల ఎవరికీ నష్టం లేదే. పేషంట్లూ హేపీ. నేనూ హేపీ. నీకేమిటి మధ్యలో. జెలసీనా' అంటూ మళ్ళా ఫెళ్ళున నవ్వాడు. నేను కోపంగా వచ్చేస్తుంటే 'నువ్వు మారలేదు ఉమేష్. నీ చుట్టూఉన్న ప్రపంచాన్ని చూడు. యిప్పటికైనా మారు. ఆదర్శాలు తిండి పెట్టవు. కడుపు నిండాలంటే కాసులు కావాలి. డబ్బు సంపాయించటం కూడా ఓ కళ. నేను పరీక్షల్లో నీ పేపర్లోంచి కాపీ కొట్టేవాణ్ణి గుర్తుందా. యిపుడు నా నుంచి ఈ కళని కాపీ కొట్టు. నీ సంసారం సుఖపడ్తుంది' అన్నాడు.

ఆ తర్వాత రవిని కల్సుకోవటం బాగా తగ్గించాను. ఈ మధ్య కాలంలో రవిని కలిసి మూడు నెలలు దాటింది. సమయం తొమ్మిది కావస్తోంది. క్లినిక్‌ని మూసేసి స్కూటర్ మీద రవి దగ్గరకు బయల్దేరాను.

రవి క్లినిక్ గాంధీనగర్ చౌరాస్తాలో ఉంది. నేను వెళ్ళేటప్పటికి పేషంట్లు ఉండరనుకున్నా. తొమ్మిది దాటినా యింకా నలుగురు పేషంట్లు ఉన్నారు.

రవి నన్నుచూసి నవ్వుతూ "నువ్వొచేటప్పుడు బైట బోర్డు చూశావా? యింత ప్రశాంతంగా ఉన్నావంటే దాన్ని చూసి ఉండవు" అన్నాడు.

"ఎప్పుడూ చూసే బోర్డేగా... నీ పేరు, దాని పక్కన డిగ్రీ, దాని కింద హోమియో ఫిజీషియన్ అని ఉంటుంది. దానికింద క్లినిక్ ఏ సమయంలో తెరిచి ఉంటుందో రాసి ఉంటుంది. అంతేగా"

"లేదు. ఓ రెణ్ణెల్ల క్రితం మార్పించి రాయించాను. అప్పటినుండీ పేషంట్లు రెండింతలు పెరిగారు తెలుసా... బిజినెస్ స్ట్రాటజీ"

"ఏమని మార్పించావు?"

"జన్మ నక్షత్రాన్ని బట్టి జాతకరీత్యా రోగికి ఏ మందు అమోఘంగా పని చేస్తుందో కంప్యూటర్ ద్వారా తెలుసుకుని మందు యివ్వబడ్తుంది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికి కూడా జ్యోతిషశాస్త్రం ప్రకారం భవిష్యత్తులో రాబోయే అనారోగ్యాల్ని తెల్సుకుని ముందు జాగ్రత్తగా కొన్నిమందులివ్వడం ద్వారా అటువంటి జబ్బులొచ్చే ప్రమాదం నివారించబడ్తుంది' అని రాయించాను. మనుషులు వేలంవెర్రిగా వస్తున్నారు తెలుసా... యింతకుముందు జబ్బు చేసినవాళ్ళే వచ్చేవాళ్ళు. యిపుడు ఆరోగ్యంగా ఉన్నవాళ్ళు కూడా వచ్చి తమ జాతకం ప్రకారం ఏఏ జబ్బులు వచ్చే అవకాశం ఉందో తెల్సుకుని మందు తీస్కెళ్తున్నారు. నాలుగొందల ఫీజడిగినా నవ్వుతూ యిచ్చెళ్తున్నారు ఉమేష్"

"నువ్వు జ్యోతిషశాస్త్రం ఎప్పుడు నేర్చుకున్నావు?"

"దీనికి జ్యోతిషశాస్త్రం ఔపోసన పట్టాల్సిన అవసరమేమీ లేదు. అదుగో అక్కడ కంప్యూటర్ ఉంది చూశావా. దాన్లో ఓ సాఫ్ట్‌వేర్ లోడ్ చేయించుకున్నాను. పుట్టిన తేదీ, సమయం, పుట్టిన వూరు యిందులో ఫీడ్ చేస్తే చాలు. జాతకం వచ్చేస్తుంది. దాన్లోంచి ఆరోగ్యానికి సంబంధించిన వివరాల్ని హైలైట్‌చేసి పేషంట్‌కి చూపిస్తాను. ముందు ముందు అలాంటి జబ్బు రాకుండా మందు యిస్తాను"

"ఏం మందు యిస్తావు?"

"మందా పాడా... రోగనిరోధక శక్తిని పెంచే మందంటూ చక్కెర గుళికలిస్తున్నా. ఉత్త ప్లాసిబో. అమోఘంగా పని చేస్తుంది తెలుసా" అంటూ పెద్దగా నవ్వాడు.

"రవీ. డాక్టర్ హానిమన్ చాలా గొప్ప వ్యక్తి. తన జీవితాన్నంతా ధారపోసి హోమియో వైద్యవిధానాన్ని కనుక్కున్నాడు. ఆ మహానుభావుడందచేసిన విజ్ఞానఫలాన్ని అపహాస్యం చేయకు. హోమియోమందులు చాలా పవర్‌ఫుల్‌గా పన్చేస్తాయి. ఏ రకమైన సైడ్‌ఎఫెక్ట్ లేకుండా రోగాన్ని నయం చేస్తాయి. ఆపరేషన్ అవసరమని యింగ్లీష్ డాక్టర్లు చెప్పిన కేసుల్లోకూడా ఆపరేషన్ అవసరం లేకుండా నేను ఎన్నో రుగ్మతల్ని నయం చేశాను. నమ్మకంలేని రోగుల్లో నమ్మకాన్ని పెంచేలా మనం కృషి చేయాలి తప్ప వాళ్ళ బలహీనతల్ని ఆసరా చేసుకుని డబ్బు దండుకోవటం మన వృత్తి కాకూడదు" అన్నాను.

"ఉమేష్, యిన్ని ఆదర్శాలు వల్లె వేస్తావు గానీ నీగ్గానీ, నీ వాళ్ళకి గాని సీరియస్‌గా

జబ్బుచేస్తే యింగ్లీష్ డాక్టర్ దగ్గరకు వెళ్ళకుండా హోమియోనే నమ్ముకుని ఉంటావా?"

"తప్పకుండా. నేనిప్పటివరకెప్పుడూ యింగ్లీష్ మందు వాడలేదు. యింట్లోవాళ్ళకు కూడా అంతే. నాకు హోమియోవైద్యం మీద పూర్తి నమ్మకం ఉంది. సర్జరీ తప్ప మరో ప్రత్యామ్నాయం లేనపుడు మాత్రమే యింగ్లీష్ డాక్టర్లని ఆశ్రయిస్తాను"

"మాటలకేంలే... ఎన్నయినా మాట్లాడొచ్చు. కార్యాచరణలో ఉండాలిగా ఆ కమిట్‌మెంట్" అన్నాడు. అతని మనస్తత్వం తెల్సిందే కాబట్టి వాదనకు దిగకుండా యింటికెళ్ళిపోయాను.

జరిగిన విషయం వీణకు చెప్తే రవినే సమర్థించింది. "రవన్న తెలివే తెలివి. హోమియోమందులకు జన్మనక్షత్రానికి ఎంత బాగా ముడివేశాడో... ఈ దెబ్బతో యిపుడున్న మేడ కాకుండా మరో మేడ కట్టేస్తాడు. ఎదుటివ్యక్తిని ఎన్ని రకాలుగా దోచుకోవచ్చో తెల్సి ఉండటమే నేటి రోజుల్లో తెలివిగల వాడి పని" అంది.

* * *

ఉదయం కాలేజీకెళ్ళిన నీలిమ మధ్యాహ్నానికల్లా తిరిగొచ్చేసింది. తలనొప్పిగా ఉందని తన గదిలోకెళ్ళి పడుకుంది. నేను వెళ్ళి లైట్‌వేస్తే "వద్దు తీసేయ్ నాన్నా. వెల్తురు కళ్ళలో గుచ్చుకుంటున్నట్టుంది" అంది. వళ్ళు తాకిచూశాను. కాలిపోతోంది. మెనింజైటిస్ ఏమోనన్న అనుమానం. లక్షణాల్ని బట్టి బెల్లడోనా మందుని పొటెన్సీలో వేశాను.

సాయంత్రం క్లినిక్కి వెళ్ళే ముందు మరోసారి నీలిమ ఎలాఉందో చూశాను. మరునాడు పరిస్థితిలో పెద్దగా మార్పులేదు. జ్వరం అలానే ఉంది. అదే మందుని మరో డోస్ వేసాను.

"అమ్మాయిని యింగ్లీష్ డాక్టర్‌కి చూపిద్దామండీ" అంది వీణ.

"డాక్టర్ని యింట్లో పెట్టుకుని మరో డాక్టర్ దగ్గరకెళ్తే ఎంత అవమానం" అన్నాను సరదాగా.

"పిల్ల మూసినకన్ను తెరవకుండా రెండ్రోజుల్నుంచి అలా పడిఉంటే మీకు నవ్వులాటగా ఉందా... ఏం జ్వరమో ఏమో... మీరిచ్చిన మందులు పని చేయటం లేదండీ. నా మాట వినండి. యింగ్లీష్ డాక్టర్ దగ్గరకు పిల్చుకెళ్దామండి. మన వీధిచివర డాక్టర్ కిశోర్ ఉన్నాడు కదా. అతను యం.డి. మంచి డాక్టరని మన కాంప్లెక్స్‌లో చాలామంది చెప్పారు"

"జ్వరానికే ఎందుకంత కంగారు పడ్తావు? తల్లిగా దానిమీద నీకెంత ప్రేమ ఉందో తండ్రిగా నాకూ అంతే ప్రేమ ఉంది. యింతకు ముందు దానికి జ్వరాలొస్తే నా మందుల్తోనేగా తగ్గింది"

"యిది మామూలు జ్వరంలా అన్పించటం లేదండీ. పిల్ల ఏదేదో మాట్లాడుతోంది.. సంబంధం లేని మాటలు"

"నా మీద నమ్మకముంచు.తప్పకుండా తగ్గిపోతుంది" అన్నాను.

ఐదు రోజులైనా జ్వరం తగ్గలేదు. పిల్లకు ఫిట్స్ వస్తున్నాయి. చేతులూ కాళ్ళూ బలంగా కొట్టుకుని స్పృహ తప్పి పడిపోతోంది.

పొటెన్సీ పెంచి మందు వేశాను.

"పిల్లని హాస్పిటల్లో జాయిన్ చేద్దామండి. నాకు భయంగా ఉంది. ఒక్కగానొక్క కూతురు. దానికేమైనా ఐతే నేను తట్టుకోలేనండీ" నీలిమ తలని ఒళ్ళో పెట్టుకుని వీణ ఏడుస్తోంది.

"అవసరం లేదు. మందేశానుగా. తగ్గిపోతుంది" అన్నాను.

"మీ మొండితనం తప్ప అసలు అమ్మాయి ఎలా ఐపోయిందో చూశారా... ఐదు రోజుల్లోనే గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. మీకు దండం పెడ్తాను. అమ్మాయిని హాస్పిటల్లో చేర్పించండి."

నా వైద్యం మీద నమ్మకం లేకుండా మాట్లాడుతున్న వీణ వైపు విసుగ్గా చూసి క్లినిక్ కెళ్ళిపోయాను.

మరునాడు నీలిమకు ఫిట్స్ ఎక్కువైనాయి. విపరీతంగా వాంతులు... జ్వరం తగ్గనే లేదు.

వూరినుంచి వీణ తన అన్నయ్యని పిలిపించింది. "బావగారూ. యిక తప్పేలా లేదు. మీరు ఒప్పుకోకున్నా నా మేనకోడల్ని అపోలోలో జాయిన్ చేస్తాను" అన్నాడు.

"ఎవరైనా నామాట కాదని అలా చేస్తే నామీద ఒట్టే" కోపంగా అన్నాను.

"మీరు రవన్నతో అన్న మాటపట్టింపుకోసం నా కూతుర్ని చంపేస్తారా?" అంది వీణ.

"రవి మాటల్ని నేనెప్పుడూ పట్టించుకోలేదు. నాకు హోమియోవైద్యం మీద నమ్మకముంది. నేను నాకూతురి జబ్బుని నయం చేయలేకపోతే వేరే వాళ్ళకి వైద్యం చేసే అర్హత కోల్పోయినట్లే."

క్లినిక్‌కి వెళ్ళే ముందు రవి యింటికొచ్చాడు. అమ్మాయిని చూశాక "ఉమేష్... మూర్ఖంగా ప్రవర్తించకు. యిది బ్యాక్టీరియల్ మెనింజైటిస్. వెంటనే యాంటీబయాటిక్స్ యివ్వకపోతే ప్రాణానికే ప్రమాదం. నేను సరదాగా అన్నాను తప్ప పందెం కాయలేదు. నామాటల్ని వెనక్కి తీసుకుంటున్నా. అమ్మాయిని హాస్పిటల్లో చేర్పించు" అన్నాడు.

"నేనెప్పుడూ మూర్ఖంగా ప్రవర్తించను. రోగనిర్ధారణ కోసం నేనూ డయాగ్నొస్టిక్ రిపోర్టుల మీదే ఆధారపడ్తాను. హోమియోకి లొంగని రోగమనీ సర్జరీ ఒక్కటే మార్గమని తెలిస్తే నేనే యింగ్లీష్‌డాక్టర్ దగ్గరకు వెళ్ళమని చెప్తాను. కానీ మెనింజైటిస్ గురించి మనం డాక్టర్‌కోర్సులో చదువుకున్నాం. దానికి చాలాబాగా పన్చేసే హోమియో మందులున్నాయని నీకూ తెలుసు"

"బ్యాక్టీరియల్ యిన్‌ఫెక్షన్‌కి యాంటీబయాటిక్స్‌ని మించిన మందులేదు ఉమేష్. పట్టుదలకు పోయి జీవితాంతం పశ్చాత్తాపపడే పనిచేయకు"

"మీరందరూ నాది పట్టుదల అంటారేమిటి? నాకు నేను చదివిన చదువుమీద నమ్మకముంది. నేనిచ్చే మందులమీద నమ్మకముంది."

"మీ నమ్మకం పాడుగాను... పిల్లను చేతులారా చంపేసేలా ఉన్నారు. నేనీరోజు పిల్లని హాస్పిటల్లో జాయిన్ చేస్తాను. ఎవరడ్డొచ్చినా సరే" వీణ అమ్మాయిని రెండు చేతుల్తో ఎత్తుకుని భుజంమీద వేసుకుంది.

నేను వేగంగా కదిలి అమ్మాయిని ఆమె భుజంమీంచి దింపి మంచంమీద పడుకోబెట్టాను.

"మీరందరూ భయపడ్తున్నట్టు అమ్మాయికేమైనా ఐతే అపుడీ ప్రాక్టీసే మానేస్తాను. హోమియోపతి పుస్తకాలన్నీ తగలబెట్టేస్తాను" అన్నాను.

"అయ్యో దేవుడా... మీరేం చేసినా మనమ్మాయి ఉండదు కదండీ" అంటూ ఏడుస్తూనే మరో గదిలోకెళ్ళిపోయింది.

"మీరనుకునేట్టు జరగదు. నా కూతుర్ని తప్పకుండా రక్షించుకుంటాను. హానీమన్ సాక్షిగా" ఆ మాటలకు బావమరిది నా వైపు చురచురా చూస్తూ వెళ్ళిపోయాడు.

"నీకు హోమియో పిచ్చి... హానీమన్ పిచ్చి... కూతురు చచ్చినా పర్లేదనే స్థాయికి దిగజారేంతగా నీ పిచ్చి ముదిరిపోయింది. యిక దేవుడొక్కడే మిమ్మల్ని రక్షించాలి" అంటూ రవికూడా వెళ్ళిపోయాడు.

మంచానికి ఓ చివరగా కూచుని నీలిమవైపు చూశాను. చిక్కిపోయి పదేళ్ళ పిల్లలా ఉంది శరీరం... యిందాక వీణ భుజంమీంచి దింపినపుడు చిన్నపిల్లలా చాలా తేలిగ్గా అన్పించింది. కళ్ళు మగతగా మూసుకుని ఉంది.

"అమ్మా నీలి... నావైపోసారి చూడు" అన్నాను. బలవంతంగా కళ్ళు తెరిచి చూసింది.

"ఈ నాన్న మీద నీకు నమ్మకముందిగా. నువ్వు కూడా అమ్మలా, మీ మామయ్యలా భయపడటం లేదుగా తల్లీ" అన్నాను.

నీలిమ పిచ్చి చూపులు చూసింది... నేనెవరో గుర్తుపట్టనట్టు... శూన్యంలోకి చూసే చూపు...

మిలియన్ పొటెన్సీలో మందుని నీళ్ళలో కలిపి గంటకోసారి అరచెంచా చొప్పున తాగించాను. రాత్రంతా మేలుకుని మందుని గంటగంటకూ పట్టించాను.

ఉదయానికల్లా ఫిట్స్ తగ్గాయి. పిచ్చిచూపులు తగ్గాయి. మరునాటికి జ్వరం తగ్గింది. పిల్ల మామూలుగా మాట్లాడింది.

నేను నమ్మిన వైద్యం నాకూతుర్ని బ్రతికించింది.

యిది జరిగిన కొన్నాళ్ళకు రవి యింజెక్షనల్లివ్వటం, యింగ్లీష్ మందులు వాడటం మానేశాడని తెలిసింది. అచ్చమైన హోమియో డాక్టర్‌గా మారిపోయి యిపుడు తను కేవలం హోమియోమందులే యిస్తున్నాడట. నా నమ్మకం నాకూతుర్నే కాదు మరో నమ్మకాన్ని బతికించింది.

**(రచన మాస పత్రిక - మార్చి 2011 - "రచన కథా పీఠం" బహుమతి)**